క్లుప్తంగా

చెక్కులు పంపిణీ



చెక్కు అందిస్తున్న బాపురెడ్డి

కథలాపూర్: మండలంలోని పోసానిపేటలో సీఎమ్మార్ఎఫ్ చెక్కులను మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి శనివారం పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన క్యాతం రవికి రూ.20 వేలు, మొగుళ్ల గంగమల్లుకు రూ. 34,500 చెక్కులను అందించారు. బాధితులకు వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైనట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం తాండ్ర్యాలలో రుద్ర రచన అనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సీఎం సహాయ నిధికి రూ. 1 లక్ష విరాళం అందివ్వగా, ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ జవ్వాజి రేవతి, జెడ్పీటీసీ నాగం భూమయ్య, సర్పంచ్ మిట్టపెల్లి గంగారెడ్డి, ఎంపీటీసీలు కొండ ఆంజనేయులు, కిరణ్‌రావు, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి పెండింగ్ పనులు పూర్తిచేయాలి



సమావేశంలో పాల్గొన్న సిబ్బంది, కమిటీ సభ్యులు

మల్యాల: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో శనివారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం ఎంపీపీ మిట్టపల్లి విమల సుదర్శన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి భవనం ప్రారంభించేందుకు పెండింగ్ పనులు పూర్తిచేయాలని అన్నారు. కార్యక్రమంలో మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మిట్టపల్లి సుదర్శన్, వైద్యురాలు మౌనిక, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

జగిత్యాల అసెంబ్లీ టికెట్ కోసం దరఖాస్తు



దరఖాస్తు చేస్తున్న మదన్‌మోహన్

రాయికల్: బీజేపీ జగిత్యాల అసెంబ్లీ అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలని కోరుతూ రాయికల్ పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది చిలుకమర్రి మదన్‌మోహన్ శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. తనకు అవకాశం ఇస్తే జగిత్యాల గడ్డపై బీజేపీ జెండా ఎగురవేస్తానని పేర్కొన్నారు.

తెలుగు భాష ఎంతో గొప్పది



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సత్యనారాయణ

జగిత్యాల: తెలుగు భాష ఎంతో గొప్పదని, ప్రతి ఒక్కరికీ తెలుగు భాషపై పట్టు ఉండాలని మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ అన్నారు. కాళోజీ జయంతిని పురస్కరించుకుని కళాశాలలో ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ వైతాళికులు కాళోజీ అని, నా గొడవ అనే పేరుతో అద్భుతమైన రచనలు కొనసాగించి నిజాం నిరంకుశత్వాన్ని ఎండగట్టి కలం, తన గళంతో ఎవరికీ జంకకుండా ఎంతో పోరాటం చేసిన వ్యక్తి అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతి, సురేశ్, రష్మిత, సలీం, నర్సయ్య పాల్గొన్నారు.

రాజీతో కేసులు పరిష్కారం



అదాలత్‌లో మెజిస్ట్రేట్, న్యాయవాదులు

మెట్‌పల్లి: కక్షిదారుల మధ్య రాజీ కుదిరితే లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారమవుతాయని మెజిస్ట్రేట్ అరుణ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రంక్ అండ్ డ్రైవ్, క్రిమినల్, సివిల్, చెక్‌బౌన్స్, గృహహింస, ఎక్సైజ్‌కు సంబంధించిన పలు కేసులను మెజిస్ట్రేట్ పరిష్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి, న్యాయవాదులు కక్షిదారులు పాల్గొన్నారు.





మిద్దె తోటలు.. ఆరోగ్య దాతలు

- అర్బన్ ఫార్మింగ్ పెరుగుతున్న ఆదరణ
- సేంద్రియ విధానంలో పండ్లు, కూరగాయల పెంపకం
- నందన వనాలను తలపిస్తున్న మిద్దె తోటలు
- పండ్లు, పూలు, కూరగాయలు, ఔషధ మొక్కల పెంపకం

జగిత్యాలటౌన్: మార్కెట్‌లో దొరికే పండ్లు, కూరగాయలు, ఆకుకూరల సాగులో విపరీతంగా పెరుగుతున్న రసాయన ఎరువుల వినియోగంతో పాటు పెరుగుతున్న కూరగాయల ధరలు వినియోగదారులను భయపెడుతున్నాయి. అధిక దిగుబడే లక్ష్యంగా రసాయన ఎరువులు, క్రిమిసంహారకాలు విరివిగా వాడి పండిస్తున్న పళ్లు, కూరగాయలతో కలిగే నష్టాలపై అవగాహన పెంచుకుంటున్న పట్టణ ప్రజలు తమ ఇంటి అవసరాలకు సరిపడా పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, పూలు, తులసి, లెమన్‌గ్రాస్ వంటి ఔషధ మొక్కలను ఇంటి డాబాలపై సేంద్రియ పద్ధతుల్లో పెంచుకుంటున్నారు. వాడి పారేసిన టైర్లు, ఖాళీ వాటర్ బాటిళ్లతో పాటు వంటింటి వ్యర్థాలనే ఎరువుగా వినియోగిస్తూ రసాయన రహిత కూరలు, పండ్లను తమ ఆహారపు అలవాట్లుగా మార్చుకుంటున్నారు. నిత్యం తమ వ్యాపార, ఉద్యోగ విధుల్లో బిజీగా ఉండే సిటీ జనాలు మిద్దె తోట సంరక్షణకు రోజు ఉదయం సాయంత్రం సమయం కేటాయిస్తూ శారీరక శ్రమ చేస్తూ ఆరోగ్యం, ఆహ్లాదం పొందుతున్నారు. కూరగాయలు, పండ్ల కోసం వెచ్చించే ఖర్చుల కలిసి రావడంతో పాటు సేంద్రియ పద్ధతిలో పండించిన తాజా పళ్లు, కూరగాయలను వినియోగిస్తూ ఆరోగ్యమే మహాభాగ్యం అన్న నానుడిని నిజం చేస్తున్నారు జగిత్యాల పట్టణ ప్రజలు. పట్టణంలో ఈ తరహా ఫార్మింగ్ రోజురోజుకు పెరుగుతోంది.

సేంద్రియ సాగుతో తాజా పళ్లు, కూరగాయలు..

విద్యా, ఉద్యోగ, ఉపాధి కోసం పట్టణాల్లో స్థిరపడ్డ పలువురు సేంద్రియ పద్ధతిలో తమ ఇంటి డాబాలపై పళ్లు, కూరగాయలు, పూలు లాంటి ఇంటికి అవసరమైన పంటలు సాగుచేస్తున్నారు. వంటింటి వ్యర్థాలను (పళ్లు, కూరగాయల చెక్కు, చెట్ల ఆకులు, కొబ్బరి పీచు తదితర) ఒక సిమెంట్ కుండీలో వేసి కొంత మట్టి కలిపి వానపాములను వదిలి 15 రోజుల తర్వాత సహజసిద్ధమైన వర్మీ కంపోస్టు ఇంట్లోనే తయారు చేసి మొక్కలకు అందిస్తున్నారు. పేడ, గోమూత్రం, నీమ్ ఆయిల్ లాంటి సహజసిద్ధమైన క్రిమిసంహారక మందులను పిచికారి చేస్తూ చీడపీడలను నివారిస్తున్నారు.



వాడి పడేసిన వస్తువులతో..

వాడి వదిలేసిన రిఫ్రిజిరేటర్లు, టైర్లు, రేకు డబ్బాలు, వాటర్ బాటిళ్లు, బకెట్లు, టబ్బులలో మట్టి నింపి మొక్కలు నాటి వాటికి సపోర్టులు ఏర్పాటు చేసి సంరక్షిస్తున్నారు. ఎండ వేడిని తట్టుకునేందుకు గ్రీన్ షెడ్‌నెట్స్ ఏర్పాటు చేస్తున్నారు.

ఇంటి అవసరాలకు సరిపడేలా..

ఇంటి అవసరాలకు సరిపడేలా బీర, చిక్కుడు లాంటి తీగజాతి కూరగాయలతో పాటు వంకాయ, గోరు చిక్కుడు, బెండ, టమాటా, మిర్చి, మునగ, కాలీఫ్లవర్ వంటి కూరగాయలు, కొత్తిమీర, మెంతి, తోటకూర, పుదీన, పాలకూర లాంటి ఆకుకూరలతో పాటు జామ, దానిమ్మ,డ్రాగెన్ ఫ్రూట్ లాంటి పళ్లు, పూలు, ఔషధ మొక్కలను పెంచుతున్నారు.పట్టణానికి చెందిన రాచకొండ నాగరాజు తన డాబాపై అరుదుగా లభించే డ్రాగెన్ ఫ్రూట్‌ను కూడా సేంద్రియ పద్ధతిలో సాగుచేస్తుండటం విశేషం.

దినచర్యగా మారింది



రోజు ఉదయం సాయంత్రం కనీసం రెండు గంటలు మొక్కల సంరక్షణకు సమయం కేటాయిస్తాను. మొక్కల కుదుళ్ల వద్ద కలుపు తీయడం, నీళ్లు పట్టడం, రాలిపోయిన ఆకులు, కొమ్మలు తొలగించడం లాంటి పనులతో శారీరక శ్రమతో పాటు మనసు ఉల్లాసంగా ఉంటుంది.

పద్మ, మిద్దె తోట యజమాని

అమ్మకు చేదోడువాదోడుగా..



మా డాబాపై అన్ని రకాల పండ్లు, కూరగాయలు, పూల మొక్కలు ఉన్నాయి. వాటి నిర్వహణలో అమ్మకు సహకరించడం నాకు ఎంతో సంతోషంగా ఉంటుంది. ముఖ్యంగా సేంద్రియ పద్ధతుల్లో సాగు చేసి ఫ్రెష్ కూరగాయలను వండుకు తింటున్నాం.

– అక్షర, విద్యార్థిని

ఆర్థిక భారం తగ్గింది



ఇంటి తోటలో పండే తాజా పండ్లు, కూరగాయలతో ఆరోగ్యంతో పాటు ఆర్థిక భారం కూడా తగ్గింది. గత ఐదేళ్లుగా డాబా పైన తోట సాగు చేస్తున్నాం. దీంతో మార్కెట్‌కు వెళ్లే అవసరం లేకపోవడంతో ఆర్థిక భారం తగ్గింది. అరుదుగా లభించే డ్రాగన్ ఫ్రూట్ సైతం పండిస్తున్నాం.

– రాచకొండ నాగరాజు
మిద్దె తోట యజమాని

మంత్రిని కలిసిన ముదిరాజ్ నాయకులు



అధ్యక్షుడిని సన్మానిస్తున్న మంత్రి కొప్పుల

ధర్మపురి: ఇటీవల ఎన్నికైన ముదిరాజ్ సంఘం మండల నూతన కార్యవర్గ సభ్యులు శనివారం మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు బట్టు కృష్ణను మంత్రి చేతుల మీదుగా సన్మానించారు. కార్యక్రమంలో పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మండల యూత్ కోఆర్డినేటర్స్ కమిటీ నియామకం

వెల్గటూర్: బీఆర్ఎస్ మండల యూత్ కో ఆర్డినేటర్స్ కమిటీని శనివారం మంత్రి కొప్పుల ఈశ్వర్ నియమించారు. అధ్యక్షుడిగా రాంనూర్ గ్రామానికి చెందిన బిడారి తిరుపతిని నియమించారు. రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కమిటీ పనిచేస్తుందని కమిటీ అధ్యక్షుడు తిరుపతి తెలిపారు. తనపై నమ్మకంతో తనకు కమిటీ అధ్యక్షుడుగా అవకాశం కల్పించినందుకు మంత్రి కొప్పులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

జెడ్పీ వైస్ చైర్మన్‌కు ఎమ్మెల్యే పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

మేడిపెల్లి: జెడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్‌రావు వారం రోజుల క్రితం ప్రమాదవశాత్తు గాయపడి కుడి కాలు విరుగగా, ఆయనను శనివారం కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు పరామర్శించారు. ఆయన వెంట డాక్టర్ సత్యనారాయణ, మామిడి శెట్టి ప్రభాకర్, రిటైర్డ్ సీఈ గోవింద రావు, సెస్ చైర్మన్ పొన్నాల శ్రీనివాస్, మేడిపెల్లి భీమారం మండలాల అధ్యక్షులు క్యాతం సత్తిరెడ్డి ఉన్నారు.

మహిళల రక్షణ కోసం షీటీం నిరంతర కృషి



షీటీం అవగాహన సదస్సులో పాల్గొన్న విద్యార్థినులు

జగిత్యాలక్రైం: మహిళల రక్షణ కోసం షీటీం నిరంతర కృషి చేస్తోందని షీటీం సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఎస్ఎస్వీ జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్ నిర్మూలన, మానవ అక్రమ రవాణా నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై జరిగే నేరాలపై వెంటనే బాధితులు పోలీసులను సంప్రదించాలని, మహిళల రక్షణకై, వారిపై జరుగుతున్న నేరాలను అరికట్టేందుకు షీటీం నిరంతరం పనిచేస్తోందన్నారు. విద్యార్థినులు, మహిళలు ధైర్యంగా ముందుకొచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎలాంటి సమస్య ఉన్నా నిర్భయంగా షీటీం నంబరు 8712670783కి సంప్రదించాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో మహిళలు, విద్యార్థినులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే టోల్‌ఫ్రీ నంబరు 1930, లేదా డయల్ 100కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై వెంకటేశ్వర్లు, ఏఎస్సై అలీబేగ్, మహిళా కానిస్టేబుళ్లు సౌజన్య, మంజూ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలు, మేకల్లో ఫుట్‌రాట్.. నివారణ

రాయికల్: గొర్రెలు, మేకల్లో ఫుట్‌రాట్ అనేది కాలిగిట్టలకు (గాలికుంటు) సంబంధించిన అంటువ్యాధి. ఈ వ్యాధి 'డికెలో బాక్టెర్ నోడోసస్' అనే సూక్ష్మజీవి ద్వారా కలుగుతుంది. వర్షాకాలంలో నేలలో ఎక్కువ తడి, బురద ఉన్నప్పుడు ఈ వ్యాధి వచ్చే అవకాశముంది. వ్యాధి సోకిన గొర్రెల నుంచి సూక్ష్మజీవులు నేలను కలుషితం చేసి వ్యాధి వ్యాప్తికి కారణమవుతాయి. ఈ వ్యాధి వల్ల గొర్రెల్లో పెరుగుదల, పునరుత్పత్తి, ఉన్ని దిగుబడి తగ్గుతాయి. ఆరోగ్యంగా ఉన్న గొర్రెల మందలోకి వ్యాధి సోకిన గొర్రె ఒక్కటి వచ్చినా ఈ జబ్బు వ్యాప్తి చెందుతుంది. యజమానులు లేదా పనివారు ఒక ఫారం నుంచి మరో ఫారానికి వెళ్తున్నప్పుడు వారి చెప్పుల ద్వారా కూడా ఈ సూక్ష్మజీవులు వ్యాప్తి చెందుతాయి. ఈ వ్యాధికి ఖర్చుతో చికిత్స కూడుకున్నది. కాబట్టి తగిన మెలకువలు పాటించి ఈ వ్యాధి రాకుండా చూడాలి.

వ్యాధి లక్షణాలు

వ్యాధి సోకిన మేకలు కుంటుతూ నడవడం ప్రథమ లక్షణం. దీంతో పాటు జ్వరం, కాలు నేలకు ఆనించలేక ఎత్తుపై పెట్టడం, మోకాలితో పాకుతూ మేయడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. గిట్టల మధ్య చర్మం ఎర్రగా లేదా తెల్లగా తడిగా ఉంటుంది. తాకితే చాలా నొప్పిగా ఉంటుంది. వ్యాధి తీవ్రంగా ఉన్నప్పుడు చీము పట్టి చెడువాసన వస్తుంది.

చికిత్స

వ్యాధితో ఉన్న జీవాలను వేరు చేయాలి. కాలిలో ముళ్లు, ఇతర వస్తువులు గాని ఉంటే గమనించి తీసి వేయాలి. కాలిగిట్టలను 10 శాతం జింక్ సల్ఫేట్ లేదా 10 శాతం కాపర్ సల్ఫేట్ ద్రావకంలో కడగాలి. లాంగ్ యాక్టింగ్ పెన్సిలిన్, ఆక్సిటెట్రాసైక్లిన్ వగైరా మందులు వాడాలి. యాంటిబయాటిక్ ఫుట్‌బాత్ పొడి వాతావరణంలో ఉంచాలి. ఫారం పరిసరాలను పరిశుభ్రంగా, పొడిగా ఉంచాలి. కొత్తగా తెచ్చిన గొర్రెలను విడిగా ఉంచాలి. పాత వాటితో కలపగూడదు. కొత్త గొర్రెలను ఫారంలోకి తెస్తున్నప్పుడు వాటికి తప్పనిసరిగా యాంటిబయాటిక్ ఫుట్‌బాత్ ఇవ్వాలి.



కుంట్లు బారిన పడిన గొర్రె

వర్షాకాలంలోనే ఎక్కువగా..



వర్షాకాలంలో ఎక్కువగా గొర్రెలు, మేకల్లో ఫుట్‌రాట్ (గాలికుంటు) వ్యాధి సంభవించే అవకాశం ఉంది. ఈ వ్యాధి బారినపడిన గొర్రెలు మేకలు కుంటుతూ నడుస్తాయి. వ్యాధిని త్వరగా గుర్తించి మందులు వాడాలి. మరిన్ని వివరాలకు 94418 58871 నంబర్‌లో సంప్రదించవచ్చు.

– గడ్డం నరేశ్‌రెడ్డి, పశు వైద్యాధికారి, అల్లీపూర్

సమ్మెకు అనుమతివ్వాలని ఎస్సైకి వినతి



ఎస్సైకి వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

ధర్మపురి: అంగన్‌వాడీలు చేపట్టనున్న సమ్మెకు అనుమతివ్వాలని కోరుతూ శనివారం ఎస్సై దత్తాత్రికి వినతిపత్రం సమర్పించారు. గత 40 ఏళ్లుగా అంగన్‌వాడీ కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్నా.. అంగన్‌వాడీల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించడం లేదని, వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ చేస్తూ ఈనెల 11న నియోజకవర్గ కేంద్రంలో నిరవధిక సమ్మెను చేపడుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీల అధ్యక్షురాలు మధవి, గంగజమున, లక్ష్మి, రమాదేవి తదితరులున్నారు.

సమ్మె నోటీస్ అందజేత

పెగడపల్లి: తమ సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 11 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న నిరవధిక సమ్మె నోటీసును శనివారం అంగన్‌వాడీ టీచర్లు పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సై సత్తయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీ టీచర్లకు గ్రాట్యూటీ చెల్లించాలన్నారు. ప్రభుత్వ టీచర్లతో సమానంగా వేతనం, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేయనున్నట్లు వారు పేర్కొన్నారు. మండలంలోని వివిధ గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

సారంగాపూర్: నేరాల నియంత్రణ, అపరిచితులు, అనుమానితులు గ్రామాల్లోకి ప్రవేశిస్తే వెంటనే తెలుసుకోవడానికి సారంగాపూర్‌లోని 5 ప్రాంతాల్లో 8 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ప్రజల సహకారంతో వీటిని గ్రామంలోని ప్రధాన కూడళ్ల వద్ద, ఎక్కువ జనసంచారం ఉండే ప్రదేశాల్లో ఏర్పాటు చేశామని తెలిపారు.

ఎమ్మెల్సీ ఇంటిలో లలితసహస్ర పారాయణం



లలిత సహస్ర పారాయణంలో జీవన్‌రెడ్డి దంపతులు

జగిత్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ నివాసం ఇందిరాభవన్‌లో శనివారం సాయంత్రం ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆయన సతీమణి అహల్యదేవి, కుటుంబ సభ్యులతో కలిసి లలిత సహస్ర పారాయణం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కుటుంబ సభ్యులతో పాటు కాంగ్రెస్ మహిళా విభాగం సభ్యులు, కాలనీ మహిళలు పాల్గొన్నారు.

ప్రజాకవి కాళోజీ జయంతి వేడుకలు



కోరుట్లలో నివాళి అర్పిస్తున్న ఎంపీపీ

మల్లాపూర్: మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో తెలంగాణ భాష దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజాకవి కాళోజి నారాయణరావు జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కనుక సంజీవ్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజియన్ సెక్రటరీ రాంప్రసాద్, క్లబ్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాయికల్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కాళోజీ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులుపాల్గొన్నారు.

కోరుట్ల రూరల్: తన రచనలతో తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి నిచ్చిన సాంస్కృతిక సౌరభం కాళోజీ నారాయణ అని ఎంపీపీ తోట నారాయణ అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జిల్లా రైతు బంధు సమితి అధ్యక్షుడు చీటి వెంకట్రావు, ఎంపీడీవో శ్రీనివాస్, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సమస్యలు పరిష్కరించకుంటే 20 నుంచి సమ్మె

కోరుట్ల: రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు పెంచిన గౌరవ వేతనం, పెండింగ్ బిల్లులతో పాటు ఇతర సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ నెల 20 నుంచి కార్మికులు మధ్యాహ్న భోజన వంటలు మానేసి సమ్మె బాట పడుతారని తెలిపారు. పట్టణంలోని సీ. ప్రభాకర్ భవన్‌లో శనివారం మధ్యాహ్న భోజన కార్మికులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు.విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి హామీ ఇచ్చి నెల గడుస్తున్నా ఇంకా అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో కొంక భాగ్య, సంగం పద్మ, పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

మేడిపెల్లి: తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం భీమారం మండల నూతన కార్యవర్గంను శనివారం జిల్లా అధ్యక్షుడు యాగండ్ల రమేశ్ వెంకట్రావుపేటలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సుదవేని ప్రశాంత్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా చుక్క తిరుపతి పటేల్, ప్రధాన కార్యదర్శిగా బైరా శ్రీనివాస్, కార్యదర్శిగా అన్వేష్, సలహాదారులు గా భర్కం మల్లారెడ్డి, రాజేందర్,హరీశ్‌ను ఎన్నుకున్నారు.

ప్రైవేట్ ఉపాధ్యాయురాలికి అవార్డు

కథలాపూర్: మండలంలోని గంభీర్‌పూర్ గ్రామానికి చెందిన పెండెం రజిత అనే ప్రైవేట్ ఉపాధ్యాయురాలు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో అందుకున్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాల్లో రజితకు అవార్డు ఇచ్చి సన్మానించారు.

పశువులకు వ్యాధినిరోధక టీకాలు

వెల్గటూర్: మండల కేంద్రంలో పశువులకు లంపీ స్కిన్, గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేసినట్లు మండల పశువైద్యాధికారి శ్రీప్రియ తెలిపారు. ఈ వ్యాధి సోకితే పాల దిగుబడి తగ్గి పశువులు చనిపోయే ప్రమాదం ఉందని అందుకే వ్యాధినిరోధక టీకాలు వేయించాలని సూచించారు. సర్పంచ్ మేరుగు మురళి, ఉప సర్పంచ్ సందీప్, పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

మెట్‌పల్లిరూరల్: మండలంలోని జగ్గసాగర్ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి (కొండస్వామి) ఆలయ అభివృద్ధికి కోసం కోరుట్ల మండలం మోహన్‌రావుపేట గ్రామానికి చెందిన విరుమల్ల రాధ–హనుమంతరావు కుటుంబసభ్యులు విరాళం అందజేశారు.ఆలయ అభివృద్ధికి రూ.10 వేలు, అన్నదానం కోసం రూ.5 వేలు ఆలయ కమిటీ సభ్యులకు శనివారం అందజేశారు.

కిక్‌బాక్సర్‌కు సన్మానం

రాయికల్: మండలంలోని మైతాపూర్ గ్రామానికి చెందిన కిక్‌బాక్సింగ్ జాతీయ క్రీడాకారుడు పడకంటి కృష్ణను శనివారం మైతాపూర్ మాజీ ఎంపీటీసీ తలారి నాగమణి రాజేశ్ ఘనంగా సన్మానించారు.